ప్రజా నినాదం 'జగనన్నే మా భవిష్యత్తు'

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: జగనన్నే మా భవిష్యత్తు నినాదం ప్రజల నుంచి వచ్చిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలంలోని కాళ్ల పాలెం, కలిదిండి, పడమటిపాలెం, ఎస్ఆర్‌పీ అగ్రహారం గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. గతంలో చంద్రబాబు పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు జరుగుతుందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి రికార్డు స్థాయిలో మిస్డ్ కాల్స్ ప్రజల నుంచి రావడం సీఎం వాయిస్‌ను ఆసక్తిగా వినడం జరిగిందన్నారు. అందరూ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. వేసవి నేపథ్యంలో కలిదిండిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, సర్పంచ్‌లు మసిముక్కు మారుతీప్రసన్న, సానా మీనా సరస్వతీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చిట్టూరి వెంకటేశ్వరరావు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ చాన్ బాషా, ఎంపీటీసీ సభ్యులు నీలి సుమన్, దొరబాబు, కందుల వెంకటేశ్వరరావు, గుడివాడ ఫణి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో 'జగన్ననే మా భవిష్యత్తు'

మండవల్లి: జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం మండవల్లిలో ఉత్సాహంగా సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన గడపగడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల మద్దతు కోరారు. మెండా సురేష్, కన్వీనర్ కొల్లా కృష్ణ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.


కలిదిండిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు


మండవల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ఝాన్సీ తదితరులు

యాకమూరులో 'మా నమ్మకం నువ్వే జగన్'

పామర్రు(తోట్లవల్లూరు): మా నమ్మకం నువ్వే జగన్-జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం తోట్లవల్లూరు మండలం యాకమూరు గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి గత ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మధ్య ఉన్న తేడాలను వివరించారు. నాలుగేళ్ల ప్రభుత్వ పాలన గురించి వివరించి వారి అభిప్రాయాలను సేకరించి నమోదు చేశారు. ఇంటి యజమాని అనుమతితో ఇంటిపై స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఈడ్పుగంటి రాజమణి, పంచాయతీ రాజ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరరావు, తోట్లవల్లూరు సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, యాకమూరు సర్పంచ్ గాదే కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సభ్యురాలు గాదే ఉమా, సీనియర్ నాయకులు దేవరపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయ ఆహ్వానం



రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా సోమవారం ముస్లింలకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. విజయవాడ విద్యాధరపురంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సీఎంకు ఆహ్వానం పలికారు.

కళకళలాడుతున్న జగనన్న ఇళ్లు

మండవల్లి: ప్రతి పల్లెలో జగనన్న కాలనీలో ఇళ్లు కళకళలాడుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. మండలంలోని కానుకొల్లు గ్రామంలో సర్పంచ్ నాగధాసి థామస్ ఎంపీటీసీ సభ్యులు పుట్టి మీనాకుమారి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏ మారుమూలకెళ్లిన జగనన్న కాలనీలు కళకళలాడుతూ కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయన్నారు. ప్రజల నుంచి డీఎన్నార్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ ఆగస్టీ ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు చేబోయిన వీర్రాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పుట్టి సత్యనారాయణ, కందుల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఉచిత ఇసుక పంపిణీ

గుడివాడ టౌన్: స్థానిక మల్లాయిపాలెం లే-అవుట్‌లో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారికి ఇసుక పంపిణీ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ లే-అవుట్‌లో 7,000 వరకు ప్లాట్‌లు ఉన్నాయని వాటిలో నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. 2,200 పైబడి పునాదుల దశ, ఆపై బడి నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. నిర్మాణంలో ప్రధానంగా కావలసిన ఇసుక మార్కెట్ యార్డులో ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులు కనుమూరు రీచ్‌లో ఉచితంగా ఇసుక తీసుకోవచ్చని అయితే లబ్ధిదారుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వమే మార్కెట్‌యార్డు వరకు ట్రాన్స్‌పోర్టు భరిస్తూ ఇక్కడ నుంచి ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భోజన విరామ సమయం తప్ప నిరంతరం ఇసుక పంపిణీ చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎగుమతి చార్జీలు రూ. 150, ట్రాన్స్‌పోర్టు చార్జీలు రూ. 500 చెల్లిస్తే మార్కెట్‌యార్డు నుంచి లబ్ధిదారుని స్థలం వరకు ఇసుక చేరుస్తామన్నారు. ఇవే కాక ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలు, డ్వాక్రా గ్రూప్ నుంచి రూ. 50 వేలుతో పాటు పావలా వడ్డీపై రూ.లక్ష వరకు రుణం ఇప్పిస్తున్నామన్నారు. వాటితో పాటు నాణ్యమైన అనేక ఉపకరణాలు సబ్సిడీ ధరలకు అందజేస్తున్నామన్నారు. కావున లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. అలాగే గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అక్కడకూడా ఏవిధమైన పరిష్కారం లభించనప్పుడు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయంలో స్పందన సెల్ నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మండలాభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దాం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులంతా సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోనూ తాగునీటి సరఫరాపై సర్పంచ్‌లు, గ్రామ సెక్రటరీలు దృష్టిపెట్టాలన్నారు. ఇంకా కాలువల ద్వారా నీరు సరఫరా అవుతున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక వసతులు ఏర్పాటు, రోడ్లు ఎత్తు చేయడం తదితర అంశాలపై హౌసింగ్ అధికారులు దృష్టిపెట్టాలన్నారు. వీటితో పాటు గ్రామాలకు సంబంధించిన అవసరతలు, ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, జయరాజు, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పెయ్యల ఆదాం

ఘనంగా ఇఫ్తార్ విందు



కైకలూరు: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పలు మసీదులలో ఇఫ్తార్ విందులు సోమవారం జరిగాయి. కైకలూరు పెద్ద మసీదులో ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు షేక్ రఫీ, ఎండీ కరీం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును అందించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ జహీర్ హాజరయ్యారు. మండవల్లి మండలం అల్లినగరం గ్రామంలో ఖాదర్ బాషా ఆహ్వానం మేరకు ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే కైకలూరు బార్ అసోషియేషన్ హాలులో మహిళా న్యాయవాది ఎండీ రజీమున్నీసా సహచర న్యాయవాదులకు రంజాన్ పాయసం బాక్సులను అందించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న అరిపిరాల, తుమ్మలపల్లి, 19న తమిరిశ, రుద్రపాక, 20న పోలుకొండ, దండిగానపూడి, 26న పెదలింగాల, నందివాడ, 27న కుదరవల్లి, ఇలపర్రు గ్రామాలలో ఈ క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ఐదు రోజులు మినహా మిగిలిన అన్ని రోజుల్లో జనార్దనపురం, పుట్టగుంట గ్రామాలలో శాశ్వతంగా ఈ క్యాంప్‌లు కొనసాగుతాయన్నారు.

లక్ష్యంతో కృషి చేస్తే విజయం తథ్యం

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: విద్యార్థులు చిన్ననాటి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే విజయం తథ్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. రవీంద్రభారతీ కిడ్స్ కాన్వకేషన్ కార్యక్రమం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం జరిగింది. యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రజాప్రతినిధులు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సయ్యపురాజు గుర్రాజు, దండే రవప్రకాష్, జీఎం శివారెడ్డి, డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రమ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

దుర్గాప్రసాద్‌కు డాక్టరేట్

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లికి చెందిన దువ్వాడ దుర్గాప్రసాద్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. తామరకొల్లు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ 'యాన్ ఎనాలసిస్ ఆఫ్ ఫర్‌సెప్షన్ ఆఫ్ టీచర్స్, స్టూడెంట్స్, పేరెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్స్ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇంటర్వెన్సెస్ అండర్ సమగ్రశిక్ష అభియాన్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నట్లు దుర్గాప్రసాద్ ఇందుకు సంబంధించిన రుజువులు సోమవారం చూపారు. డాక్టర్ పి. స్వరూపారాణి ఆధ్వర్యాన విద్యావిభాగానికి సంబంధించి ఈ పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు. దుర్గాప్రసాద్‌ను డాక్టరేట్ వరించడంపై స్థానిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



దళితులకు న్యాయం చేయాలని వినతి

ముదినేపల్లి రూరల్: తరతరాలుగా ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటూ ఉన్న దళితులను భూములు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం తగదని వారికి తగిన న్యాయం చేయాలని దళిత బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని శ్రీహరిపురంలో ప్రభుత్వానికి చెందిన భూముల్లో ఇళ్లు వేసుకుని దళితులు సమీప భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్లు, సాగు చేసుకుంటున్న భూములు ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం తగదని దీనిపై తగిన న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ నివాసముంటున్న ఇళ్లను ఖాళీ చేయాల్సిన పనిలేకుండా సహకరిస్తానని, సాగు చేసుకుంటున్న భూములు రెవెన్యూ రికార్డుల్లో చెరువుగా నమోదు అయివున్నందున భూముల నుంచి ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు సమస్యను తెలియజేసి వినతిపత్రం అందజేస్తామని నాగేశ్వరరావు అన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పామర్రు(పమిడిముక్కల): మండలంలోని కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతల సహకారంతో వంట సామగ్రిని అందజేశారని ఎంపీపీ కాసాని వేద సుప్రజ అన్నారు. ఉన్నత పాఠశాలలో వంట సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు విజ్ఞప్తితో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఎన్నారై వింగ్ కూచిభొట్ల కిరణ్ తన స్నేహ హస్తాలు ఫౌండేషన్ సహకారంతో సుమారు రూ.22వేల విలువ గల వంట సామగ్రిని గ్రామ సర్పంచ్ బుల్లా నాగమణి, ఎంపీటీసీలు కంచర్ల అంక కుమారి, మరీదు రాజ్యలక్ష్మిల చేతుల మీదుగా పాఠశాలకు బహూకరించారన్నారు. హెచ్ఎం ఎం. ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కొణతం శివరామకృష్ణ వీర్ల శ్రీను, గజాల రాము, కృష్ణాజిల్లా రెడ్డిక సంక్షేమ సంఘ అధ్యక్షురాలు దారపు రమాదేవిరెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లా లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



పామర్రు(పమిడిముక్కల): మండలంలోని అలీనబీపాలెంలో సయ్యదా జైనబ్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని సోమవారం ముస్లింలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. సొసైటీ సభ్యులు మాట్లాడుతూ మండల పరిధిలోని సుమారు 100 మంది నిరుపేదలైన ముస్లింలు, వితంతువులకు ఈ తోఫాను అందించామని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ ఆలీ, కార్యదర్శి మీర్జా కరామత్ ఆలీ, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్‌బాబు, మారపాక మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, లంకపల్లి ఎంపీటీసీ మీర్జా సజాద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి కళాపీఠానికి వాటర్ ప్యూరిఫైర్ వితరణ



కూచిపూడి(మొవ్వ): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రయోజనాల కోసం పలు సేవా కార్యక్రమాలను కూచిపూడి రోటరీ క్లబ్ ద్వారా అందిచటం ప్రశంసనీయమైనదని డిస్టిక్ గవర్నర్ వి. భాస్కరరావు పేర్కొన్నారు. అఫీషియల్ విజిట్‌లో భాగంగా సోమవారం కూచిపూడి రోటరీ క్లబ్‌ను గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా కూచిపూడిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠానికి కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్లపెనుమర్తి వెంకట రామ శేష సాయి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వాటర్ డిస్పెన్సర్(ప్యూరిఫైయర్)ను గవర్నర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ రెడ్డి చౌదరి, క్లబ్ చాటర్ ప్రెసిడెంట్ గొట్టిపాటి రామకృష్ణ రావు, సెక్రటరీ పి. రమేష్, కె. మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సాయం అవసరం



జమిదింటకుర్రు(పెదపారుపూడి): ప్రభుత్వ పాఠశాలకు దాతలందిస్తున్న సహకారం మరవలేనిదని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. మండలంలోని జమీదింటకుర్రు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు రూ. 1.40 లక్షల విలువ కలిగిన భోజనం ప్లేట్లు, విద్యార్థులు ఆడుకునేందుకు జారుడు బల్ల, ఉయ్యాల, ఇతర ఆట వస్తువులను గ్రామానికి చెందిన కొల్లి వేణుగోపాల స్వామి, శ్రీరావమ్మ జ్ఞాపకార్థం టీఎల్ పెరుమాళ్ల, ప్రభావతిల కుమారుడు ప్రభాకరరావు, కుమార్తె లలిత సి. రాయన్ సోమవారం అందజేశారు. ఎంఈవో బి. శ్రీనివాస్, సర్పంచ్‌లు పుణుకొల్లు శివరామప్రసాద్, పాతూరి రమేష్, గోళ్ల సోమేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ జాజుల చిన్నారి, మాజీ జెడ్పీటీసీ మూల్పూరి హరీష, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

గ్రామసభలతో సమస్యల పరిష్కారం

ముదినేపల్లి రూరల్: గ్రామసభలతో స్థానిక సమస్యలు సమర్థంగా పరిష్కరించుకోవచ్చని పలువురు సర్పంచ్‌లు అన్నారు. మండలంలోని చేవూరు, ఈడేపల్లి, గురజ, కాకరవాడ, పెదకామనపూడి, ప్రొద్దువాక పంచాయతీల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలకు సంబంధించిన పాలనా వ్యవహారాలు ఆదాయ, వ్యయాలు, అభివృద్ధి పనుల వివరాలను సభల్లో ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశముందన్నారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు గ్రామసభల్లో పాల్గొంటే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ సభల్లో సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సభలు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. అప్పాపురం, గన్నవరం, కొవ్వాడలంక, నందిగామలంక, ప్రత్తిపాడు, పుట్లచెరువు గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. గన్నవరంలో జరిగిన గ్రామసభలో చేపట్టబోయే పనులను గ్రామసభలో వివరించారు. సంక్షేమ పథకాలను వివరించారు. మాజీ సర్పంచ్ గుడివాడ తమ్మస్వామి, ఎల్ఎస్ భాస్కరరావు, కార్యదర్శి దయామణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ అగ్ని ప్రమాదాలపై అవగాహన

మొవ్వ: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి, సరైన నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించాలని ఫైర్ అధికారి కె. వెంకటేశ్వరరావు సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎస్ఎఫ్‌వో అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ వి శ్రీధర్ పాల్గొన్నారు.

■ మండవల్లి జెడ్పీ స్కూల్లో..

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ సిబ్బంది మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఫైర్ సిబ్బంది ఎం.రాంభాస్కర్, వి.అంజిబాబు, ఎం.పరశురాముడు, సీహెచ్ గణేష్, డి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

■ కొనసాగుతున్న వారోత్సవాలు

గుడివాడ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని విద్యావికాస్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి జె. ఆంజనేయులు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలకు కారణాలను వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు భయంతో అక్కడ నుంచి పారిపోకుండా యుక్తితో వాటిని నిలువుదల చేసేందుకు ప్రయత్నించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ గమనించినప్పుడు వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడం అవసరమని ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యావికాస్ డైరెక్టర్ కె. సాంబశివరావు పాల్గొన్నారు.

■ శరవేగంగా ఫ్లై ఓవర్ పనులు

గుడివాడ టౌన్: ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుకూలంగా పురపాలక సంఘ అధికారులు పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్‌లు, స్తంభాలు తొలగించగా, రెవెన్యూ అధికారులు రోడ్ మార్జిన్ ఆక్రమణలు తొలగించారు. సోమవారం నిర్మాణానికి అనుకూలంగా రహదారిపై ఉన్న డివైడర్లు, చెట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తయిన వెంటనే సర్వీస్‌రోడ్లు నిర్మాణం ప్రారంభిస్తామని అనంతరం ఫ్లై ఓవర్ నిర్మాణం చేపడతారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

■ న్యాయవాదుల విధుల బహిష్కరణ

మొవ్వ: న్యాయవాదులకు సీఐడీ అకారణంగా నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచినందుకు నిరసన తెలుపుతూ మొవ్వ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విజయవాడకు చెందిన న్యాయవాదులు రాజేంద్ర ప్రసాద్, జి. రామకృష్ణ ప్రసాద్, జి. శ్రావణకుమార్‌లకు నోటీసులు ఇవ్వటాన్ని ఖండిస్తూ, సంఘీభావంగా విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లూరి రామాంజనేయులు, కొడాలి మురళీలు ప్రకటనల ద్వారా తెలిపారు.

■ నూతన కార్యవర్గం

గుడివాడ టౌన్: భారత్ వికాస్ పరిషత్ అమరావతి, గుడివాడ శాఖల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక ఉపద్రష్ట బ్రాహ్మణ సత్రంలో సోమవారం జరిగింది. అమరావతి నూతన అధ్యక్షుడిగా షా రూప్ చండ్ జైన్, ప్రధాన కార్యదర్శి కమల్ నయన్ భంగ్, కోశాధికారిగా ఎంవీఎన్ రామచంద్రరావు, గుడివాడ శాఖ అధ్యక్షుడిగా షా జ్ఞాన్‌చంద్ జైన్, ప్రధాన కార్యదర్శి నల్లూరి శేషగిరిరావు, కోశాధికారిగా తిరుమలశెట్టి హారికలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో దక్షిణ భారత ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్‌వీఆర్ ప్రసాద్, బైరిశెట్టి మల్లిఖార్జునరావు, అమరావతి ప్రాంతీయ సలహాదారు చోడవరపు విజయకుమార్ పాల్గొన్నారు.

■ చలివేంద్రం ప్రారంభం

గుడివాడ టౌన్: వేసవి ఎండలు అధికమవడంతో ప్రయాణికులు, బాటసారులకు దాహం తీర్చేందుకు దాతలు ముందుకు రావాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో సోమవారం శ్రీ యశస్విణి ఫ్లవర్ డెకరేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యశస్విణి ఫ్లవర్ డెకరేషన్స్ యజమానులు పాల్గొన్నారు.

■ హిందూ సమాజ పరిరక్షణ

కైకలూరు: హిందూ సమాజ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల్ భారత సహ ధర్మజాగరణ ప్రముఖ్ శ్యామ్ కుమార్ కోరారు. కైకలూరు సీతారామ కల్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠిత వ్యక్తుల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా పేరిచర్ల రామరాజు, నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున హిందూ జాగరణ ప్రముఖులు హాజరయ్యారు.

■ సద్వినియోగం చేసుకోవాలి

పెదపారుపూడి: జాతీయ ఉపాధి హామీ పథకం ప్రభుత్వం పేదలకు కల్పిస్తున్న పనులను ఉపాధి కూలీలు స్వదినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలో సోమవారం వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరాతో కలిసి పంట బోదెల తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలి ప్రభుత్వం పని కల్పిస్తుందన్నారు. ఉపాధి పని వద్ద కూలీలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలను కల్పించాలని సిబ్బందిని కోరారు.

■ త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం గండేపూడి, పొనుకుమాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఇందూ జ్ఞానవేదిక ఆగిరిపల్లి బృందంచే భగవద్గీత సారాంశ ప్రతులను సోమవారం పంపిణీ చేశారు. భగవద్గీత సారాంశం ప్రకారం సంక్రాంతి అంటే గుణాలపై తిరుగుబాటు అని తెలిపారు. ఉత్తరాయణంలో మోక్షం పొందే అవకాశం ఉంది కాబట్టి అసలైన పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు ధనుంజయ, సభ్యులు పాల్గొన్నారు.